సాక్షి మంచిర్యాల

శుక్రవారం। 1। సెప్టెంబర్। 2023



గుడ్ టచ్.. బ్యాడ్ టచ్..!

చిన్నారులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కుటుంబంపై ఎంతైనా ఉంది. అలాగే పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన షీ టీమ్ ద్వారా సైతం విస్తృతంగా అవగాహన కల్పిస్తూ తోడుగా నిలుస్తున్నారు. 8లో▸



తండాలకు తీజ్ శోభ

తీజ్.. గిరిజన తండాల్లో తేజాన్ని నింపే పండుగ. జిల్లాలోని బంజార (లంబాడా)తండాల్లో రక్షాబంధన్ నుంచి తీజ్ ఉత్సవం ప్రారంభమైంది. శ్రీకృష్ణాష్టమికి ముగియనుంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.4 /26.3

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా చినుకులు పడే అవకాశం ఉంది.






ప్రజాప్రతినిధుల రాఖీ పండుగ

రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. సోదరులు కానుకలు ఇచ్చారు. వేడుకలను జిల్లా ప్రజాప్రతినిధులు సైతం ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వగృహంలో ఆయన చెల్లెలు స్వర్ణ రాఖీ కట్టారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావుకు తెలంగాణ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సెకండ్ ఏఎన్ఎంలు కూడా రాఖీలు కట్టి ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని కోరారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు నెన్నెల ఎంపీపీ రమాదేవి రాఖీ కట్టారు. మందమర్రి పట్టణంలోని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి బీఆర్ఎస్ నాయకులకు రాఖీలు కట్టారు.

- చెన్నూర్/మంచిర్యాలఅర్బన్/నెన్నెల/మందమర్రిరూరల్

న్యూస్‌రీల్

సీఎమ్మార్ త్వరగా పూర్తి చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సమీక్షలో అదనపు కలెక్టర్ మోతీలాల్

నస్పూర్: జిల్లాకు కేటాయించిన సీఎమ్మార్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనర్, ఎఫ్‌సీఐ అధికారులతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన సీఎమ్మార్ లక్ష్యాలను రైస్ మిల్లుల నిర్వాహకుల సమన్వయంతో త్వరగా అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ జిల్లాలో 1001 రకం ధాన్యం పండించడంతో రా రైస్ ఎఫ్‌సీఐ సంస్థకు ఇవ్వడం ఇబ్బందిగా ఉందని తెలిపారు. బాయిల్డ్ రైస్ కేటాయిస్తే త్వరగా ప్రక్రియ పూర్తిచేస్తామని తెలిపారు.


డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలో ప్రారంభించనున్న మహాత్మ జ్యోతిబాపూలే బాలుర డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు బీఏ(ఈపీహెచ్), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజెడ్‌సీ) కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తులను గుడిపేటలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 79934 56620, 99489 89949 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోతెపల్లి వంతెన నిర్మాణానికి నిధులు

మంచిర్యాలటౌన్: లక్సెట్టిపేట మండలంలో 63వ నంబర్ జాతీయ రహదారిపై పోతెపల్లి గ్రామం వద్ద ఇటీవల వర్షాలకు ధ్వంసమైన వంతెన పునర్నిర్మాణానికి సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. ఎత్తు వంతెన నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.2.20 కోట్లు మంజూరు శారని పేర్కొన్నారు. త్వరలోనే టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సాక్షి, మంచిర్యాల ప్రతినిధి: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గురువారం సమ్మెకు దిగారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరాస్తాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపుయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి.. తొమ్మిదేళ్లు గడిచినా తమను పర్మినెంట్ చేయలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది ఉద్యోగులు 16 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల వేళ.. సంక్షేమ ఆశలు

- ప్రభుత్వ పనులు, పథకాల అమలు వేగవంతం
- ఇంకా కొన్నిచోట్ల ఏళ్లుగా అదే జాప్యం
- ఎలక్షన్ షెడ్యూల్ వస్తే పనులకు బ్రేక్
- ఈ రెండు నెలలే కీలకం



రామకృష్ణాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు



మొదటి విడత పంపిణీ చేసిన గొర్రెలు(ఫైల్)



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దివాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో పెండింగ్ అభివృద్ధి పనుల పూర్తి, సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రకటించిన పథకాలతోపాటు తాజాగా అమలు చేస్తున్నవాటి కోసం అర్హులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో గృహలక్ష్మికి 50 వేలు, మైనారిటీబంధుకు 2,954 మంది, బీసీబంధుకు 11,106 అర్జీలు వచ్చాయి. వీటిలో మైనార్టీలు వంద మందికి, బీసీలకు వంద మంది చొప్పున రూ.లక్ష చొప్పున చెక్కులు ఇచ్చారు. రెండో విడత గొర్రెల పథకం, 58, 59 జీవో నోటరీలతో స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ జరుగుతోంది. 19 వేల మందికి దివ్యాంగుల పెన్షన్ పెంపు, కారుణ్య నియామకాలు త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. ఇటీవల చెన్నూరు ఆసుపత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ అనుమతులు వచ్చాయి. చెన్నూరులో చింతలపల్లి–అక్కెపల్లి మధ్య వంతెన, చెక్‌డ్యాం, మందమర్రి మండలంలో పాలవాగుపై, అందుగులపేట, పులిమడుగు వద్ద నిర్మించే వంతెనలకు నిధులు వెచ్చించనున్నారు. జిల్లాలోని 311 గ్రామ పంచాయతీలకు మొత్తం రూ.206.10 కోట్లు విడుదల చేస్తు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2023–24 సంవత్సరం ప్రత్యేక నిధులను సంక్షేమం, అభివృద్ధి కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఈ నిధుల ఖర్చు కోసం జిల్లా ప్రణాళిక విభాగం కసరత్తు చేయనుంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోపే పెండింగ్ పనులు, అర్హుల ఎంపిక పూర్తయితేనే మేలు జరిగే అవకాశం ఉంది.

పెండింగ్‌లో అనేక పనులు..

జిల్లాలో అనేక పనులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఏడు మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్లు అందుబాటులోకి తేవాల్సి ఉంది. ఇప్పటికీ ఒక్కచోట కూడా పనులు పూర్తి కాలేదు. సెంట్రల్ లైటింగ్స్, అంతర్గత రోడ్లు, ప్రజా మరుగుదొడ్లు పూర్తి కాలేదు. పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల ఏర్పాటు చేయాల్సి ఉంది. మన ఊరు మనబడి కింద 248 స్కూళ్లలో వసతులు మెరుగుపర్చాల్సి ఉంది. రోడ్లు, భవనాల పరిధిలో 141 పనుల్లో మొత్తం 512 కి.మీ. రోడ్లు నిర్మించాల్సి ఉంది. మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయాలి. 64 మహిళా భవనాలు పూర్తి చేయాల్సి ఉంది. గత నెలలో కురిసిన వర్షాలకు జిల్లాలో 13 చెరువులకు గండ్లు పడ్డాయి. శాశ్వత పనుల కోసం నిధులు విడుదల కావాలి. జిల్లా కేంద్ర గ్రంథాలయం పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి.

సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాలు

కడెం ప్రాజెక్టు చివరి ఆయకట్టు నీరందించడం, హాజీపూర్ మండలం పడ్తాన్‌పల్లిలో రూ.90 కోట్లతో చేపట్టిన 10 వేల ఎకరాల సాగునీరందించే ఎత్తిపోతల పథకం, చెన్నూరు ఎత్తిపోతల కింద రూ.1,658 కోట్లతో చేపట్టే లక్ష ఎకరాల సాగు నీరందించే పథకం పనుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గం ఇప్పటికీ ప్రధాన సాగు నీటి వనరులేవీ లేకపోవడంతో వార్ధా నదిపై నిర్మించే బ్యారేజీపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

'దళితబంధు'కు నిరీక్షణ

జిల్లాలో మొదటి విడత నాలుగు నియోజకవర్గాల్లో వంద చొప్పున మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఖానాపూర్ (జన్నారం) పరిధిలో 313 మందిని దళితబంధుకు ఎంపిక చేశారు. రెండో విడత ఒక్కో నియోజకవర్గంలో 1100 మందికి మంజూరు చేస్తారని చెబుతున్న నేపథ్యంలో అర్హులు నిరీక్షిస్తున్నారు.

'డబుల్ బెడ్‌రూం' జాప్యం

జిల్లాలో రూ.317 కోట్లతో 2,616 ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. కానీ 1,046 మాత్రమే పూర్తయ్యాయి. ఇవి ఎప్పుడు అందుతాయో అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. తాజాగా గృహలక్ష్మి పథకం ప్రకటించడంతో సొంతిల్లు నిర్మించుకునే వారు రూ.3 లక్షల సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

స్వచ్ఛతలో పోటీ!

- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌కి 20 గ్రామాలు ప్రతిపాదన
- మెరుగైన ర్యాంకింగ్ కోసం పోటీపడుతున్న వైనం
- అంశాల వారీగా కేంద్ర బృందాల పర్యవేక్షణ



గ్రామాల్లో పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా గ్రామాలను స్వచ్ఛమైన నివాస ప్రాంతాలుగా మార్చాలన్న లక్ష్యంతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉత్తమ పంచాయతీలు, మున్సిపాలిటీలకు కేంద్రం ఏటా పురస్కారాలు ప్రదానం చేస్తోంది. పరిశుభ్రతకు అవార్డులు అందించే స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన గ్రామాలు సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. దేశ వ్యాప్తంగా పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాలన్నీ స్వచ్ఛ సర్వేక్షణ్‌కు పోటీపడుతున్నాయి. ఈ క్రమంలో 2023 సంవత్సరానికి జిల్లా నుంచి 20 గ్రామ పంచాయతీలను అధికారులు ఎంపిక చేశారు. ప్రధానంగా ఓడీఎఫ్–ప్లస్ పూర్తి చేసిన గ్రామాలను ఎంపిక చేశారు.

విస్తృతంగా అవగాహన..

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపికైన 20 గ్రామాల్లో పరిశుభ్రత విషయంలో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఈ పోటీల్లో సత్తా చాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇక పరిశుభ్రత విషయంలో అంతకు ముందు స్వచ్ఛత యాప్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తీసుకుని ఎంపిక చేసేవారు. యాప్‌పై ప్రత్యేకంగా అవగాహన కల్పించి మరీ అభిప్రాయాలు తీసుకునేవారు. కానీ ఇప్పుడు గ్రామాల్లో పర్యటించే బృందం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంశాల వారీగా నివేదిక తయారు చేస్తోంది.

ముగిసిన పర్యవేక్షణ..

పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్‌ల ఆధ్వర్యంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ అధికారులు అంశాల వారీగా పర్యవేక్షించారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా మరుగుదొడ్ల నిర్మాణం, వాటి వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణం, ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ, కాంపోస్టు షెడ్ నిర్వహణతోపాటు మొత్తం 50 అంశాల వరకు కేంద్ర బృందం పర్యవేక్షించింది. ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఆధారంగా నివేదికలు రూపొందించి అవార్డుకు ఎంపికయ్యేలా కసరత్తు పూర్తి చేశారు.

ఎంపికైన గ్రామాలు ఇవే..

బూదాకలాన్, పెరకపల్లి(బెల్లంపల్లి), ఖాజీపల్లి, పొలంపల్లి(భీమారం), చిన్నతిమ్మాపూర్(భీమిని), కిష్టంపేట(చెన్నూర్), తాళ్లపేట, గూడెం, నంబాల, నాగసముద్రం(దండేపల్లి), కర్ణమామిడి(హాజీపూర్), పొనూర్(జైపూర్), పొనకల్, ఇందన్‌పల్లి, రాంపూర్(జన్నారం), జజ్జరవెల్లి(కన్నెపల్లి), ధర్మారావుపేట(కాసిపేట), మామిడిగట్టు(మందమర్రి), కాసిపేట, తాండూర్(తాండూర్) గ్రామాలు ఎంపికయ్యాయి. ఈ గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా జెడ్పీ సీఈవో కె.నరేందర్, డీఆర్డీవో బి.శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, అదనపు డీఆర్డీవో దత్తారావు, డీఎల్‌పీవోలు ఫణీందర్‌రావు, ప్రభాకర్‌రావు వ్యవహరించగా కేంద్ర బృందం పర్యవేక్షించి నివేదిక తయారు చేసింది.


పర్యవేక్షణ పూర్తయింది..



గ్రామాల్లో స్వచ్ఛత తదితర అంశాలపై చేపట్టిన కేంద్ర బృందం పర్యవేక్షణ పూర్తయింది. ఎంపికైన 20 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా బృందం నివేదిక ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు వచ్చే అవకాశం ఉంది. ఎంపికైన గ్రామాల్లో చెత్తాచెదారం, మురికి కూపాలు, అపరిశుభ్రత లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలు సహకరించేలా పర్యవేక్షిస్తున్నాం.

– వెంకటేశ్వర్‌రావు, డీపీవో, మంచిర్యాల

కేంద్రీయ విద్యాలయంపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: జిల్లాలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యాబోధనపై కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం సమీక్ష నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ బి.రాహుల్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో కలిసి మొదటి వార్షిక సమావేశం నిర్వహించారు. 2022–23 విద్యాసంవత్సరం ఫలితాలలో విద్యార్థులు 95 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వార్షిక ఫలితాల్లో 67.4 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. 9, 10 విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి లాంగ్ జంప్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. చదరంగంలో 3వ స్థానం సాధించామని, ఖోఖోలో 24 మంది విద్యార్థులు ప్రతిభ చాటారని తెలిపారు. విద్యార్థులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన కోసం మాక్ డ్రిల్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ వారిని వివిధ రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. విద్యాలయ పర్యవేక్షణ కమిటీ అధికారులు విద్యాలయాన్ని సందర్శించి అవసరమైన సౌకర్యాలను గుర్తించాలని సూచించారు. శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఇన్‌చార్జి డీసీవోగా శ్రీనివాస్



బదిలీపై వెళ్తున్న కృష్ణను సన్మానిస్తున్న అధికారులు

మంచిర్యాల అగ్రికల్చర్: జిల్లా సహకారశాఖ అధికారి డి.కృష్ణ పదోన్నతిపై బదిలీ కాగా ఆయన స్థానంలో నిర్మల్ డీసీవో శ్రీనివాస్‌ను జిల్లాకు ఇన్‌చార్జిగా నియమిస్తూ జిల్లా సహకారశాఖ కమిషనరేట్ ఆదేశాలు జారీ చేసింది. పదోన్నతిపై వెళ్తున్న డీసీవో కృష్ణను జిల్లా సహకారశాఖ అధికారులు, సిబ్బంది సన్మానించారు.

లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య సూచించారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో మహిళా చట్టాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. వాటిపై అవగాహన ఉండాలని, అవసరమైన సమయాల్లో వినియోగించుకోవాలని సూచించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, పోక్సో తదితర చట్టాల గురించి వివరించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేసి పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం బాలికలు ప్రిన్సిపాల్, ఏసీపీ, ఇతర పోలీసు అధికారులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, విక్టర్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు

- దివ్యాంగులు, వృద్ధులకు ఉపయోగకరం
- వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఈసీ చర్యలు
- కసరత్తు చేస్తున్న జిల్లా యంత్రాంగం



కైలాస్‌నగర్: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం నూతన సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో వారికి అవసరమైన వసతులను కల్పిస్తోంది. ముఖ్యంగా ఈ ఏడాదిలో జరిగే ఎన్నికల్లో దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి నుంచే తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం విజయవంతం కావడంతో రాష్ట్రంలోనూ అమలు చేసేలా ఈసీ ఆదేశాలను జారీ చేసింది. ఈమేరకు జిల్లా యంత్రాంగం పోలింగ్ కేంద్రాల వారీగా వృద్ధులు, దివ్యాంగులను గుర్తించేపనిలో నిమగ్నమైంది.

రాజకీయ పార్టీల పాట్లు

దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు గతంలో నానా తిప్పలు పడాల్సి వచ్చేది. వారి ఓట్లను రాబట్టుకునేందుకు వివిధ రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చేది. వారి ఓట్లను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు వారే స్వయంగా ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చేవారు. పార్టీలకు సంబంధం లేని వారు ఓటుహక్కును వినియోగించుకోవాలంటే ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాల్సి వచ్చేది. అక్కడి నుంచి తమ చేతులను స్ట్రెచర్లుగా మార్చుకుని పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లి ఓటు వేయించేవారు. ఇలాంటి పరిస్థితులను గమనించిన ఎన్నికల సంఘం వృద్ధులు, దివ్యాంగులు సైతం తమ ఓటును ప్రశాంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టింది. దివ్యాంగులు ఓటు వేసేలా పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులను నిర్మిస్తోంది. కేంద్రాలకు వచ్చిన వారిని లోపలికి తీసుకెళ్లేలా ట్రై సైకిల్స్‌ను ఏర్పాటు చేస్తోంది. వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చేలా ప్రత్యేక వాహనాలను సైతం ఏర్పాటు చేస్తోంది. అయినప్పటికీ మంచానికే పరిమితమైన దివ్యాంగులు, వయోవృద్ధులు ఇప్పటికీ ఓటింగ్‌కు దూరంగానే ఉంటున్నారు. ఇలాంటి వారు కూడా ఓటును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో నూతన విధానం అమలు చేస్తోంది.

ఇంటి వద్దనే ఓటు వినియోగం

దివ్యాంగులు, వయోవృద్ధులు బయటకు వచ్చి ఓటు వినియోగానికి ఇబ్బందులు పడకుండా నేరుగా వారి వద్దకే ఎన్నికల సిబ్బందిని ఈవీఎంతో సహా పంపించే ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం విజయవంతం కావడంతో త్వరలో జరుగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ దాన్ని అమలు చేయాలని ఈసీ నిర్ణయించింది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేస్తోంది. ఈసీ నిర్దేశించిన ఈవీఎంతో కూడిన ప్రత్యేక వాహనం నేరుగా దివ్యాంగులు, వయోవృద్ధులైన ఓటర్ల ఇంటి వద్దకే వెళ్తుంది. పోలీస్ బందోబస్తుతో కూడిన ఈ వాహనంలో ఎన్నికల సిబ్బంది ఈవీఎంలో వీడియో చిత్రీకరణ ద్వారా ఓటు వేయించనున్నారు. దీంతో తాము ఉన్న చోటు నుంచే ఓటుహక్కు వినియోగించుకునే వెసులుబాటు కలుగనుంది.

పోలింగ్‌శాతం పెంపే లక్ష్యం

ఎన్నికలు జరిగిన ప్రతిసారీ వందశాతం పోలింగ్ నమోదు చేయాలని ఈసీ లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ఆచరణలో అది సాధ్యం కావడం లేదు. అందుకు ఇలాంటి క్షేత్రస్థాయి ఇబ్బందులున్నాయి. వాటిని దూరం చేసి ఈ ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన వయోవృద్ధులు, దివ్యాంగుల ఓటరు నమోదు పూర్తిస్థాయిలో వినియోగమయ్యేలా ఈ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. దీంతో పోలింగ్‌శాతం పెరుగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు

వయో వృద్ధులంతా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నెల 22న వయోవృద్ధులచే ఓటు వినియోగంపై అవగాహన సదస్సుతో పాటు వారితో ర్యాలీ సైతం నిర్వహించారు. నేను తప్పకుండా ఓటు వేస్తాను అని తెలియజేసేలా వయోవృద్ధులచే ప్రతిజ్ఞ చేయించడంతో పాటు 80ఏళ్ల పైబడిన ఓటర్లను శాలువాతో సత్కరించి ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు.

జిల్లాల వారీగా దివ్యాంగులు, వయోవృద్ధులు, ఓటర్ల వివరాలు

జిల్లా	వయోవృద్ధులు	దివ్యాంగులు	మొత్తం ఓటర్లు
మంచిర్యాల	8,796	6,864	5,90,620
ఆదిలాబాద్	5,431	4,534	4,34,271
కుమురంభీం	5,100	3,900	4,31,655
నిర్మల్	9,800	8,200	6,83,848

క్లుప్తంగా

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య


పంచనామా చేస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): మద్యం మత్తులో యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై గుంపుల విజయ్ కథనం ప్రకారం.. దేవాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ ధరంసింగ్(22) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకులు ఎంతవాదించినా వినకపోవడంతో రెండు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన నిహారికతో వివాహం చేశారు. అయినా మద్యం తాగడం మానేయలేదు. బుధవారం సైతం అతిగా మద్యం తాగి రావడంతో తల్లిదండ్రులు, భార్య మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ధరంసింగ్ పురుగుల మందుతాగి కుటుంబీకులకు తెలిపాడు. దీంతో కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

మద్యం మత్తులో యువకుడు..

వాంకిడి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... మండలంలోని సొనపూర్ జీపీ చిచుపల్లి గ్రామానికి చెందిన అడ కృష్ణ (21) కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపాడు.

మద్యానికి బానిసై ఒకరు..

దహెగాం: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఐనం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. ఆత్మకూరి లక్ష్మిపతి (59) మద్యానికి బానిసై తరచు భార్యతో గొడవ పడేవాడు. అదే క్రమంలో గురువారం కూడా అతిగా మద్యం తాగి భార్యతో గొడవ పడి ఇంట్లోకి వెళ్లి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ప్రకాష్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రసన్నంజనేయనగర్‌కు చెందిన మల్కరి నాగేశ్వర్(60) అనారోగ్యంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... నాగేశ్వర్ మద్యానికి బానిస కావడంతో పాటు కొంతకాలంగా ఫైల్స్‌తో బాధ పడుతున్నాడు. బుధవారం రాత్రి నొప్పి ఎక్కువకావడంతో మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాలకిషన్ తెలిపారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం


మల్లేశం (ఫైల్)

నస్పూర్: మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తితో గడ్డి మందుతాగి వ్యాపారి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రవికుమార్ వివరాలు వెల్లడించాడు. పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్‌కు చెందిన ముత్తె మల్లేశం(55) వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఎవరితో మాట్లాడకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం బయటకి వెళ్లి పురుగుల మందు తాగి కుమారుడు శ్రావణ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. శ్రావణ్ లొకేషన్ ఆధారంగా తండ్రి ఉన్న ప్రాంతానికి చేరుకుని అపస్మారక స్థితిలోని తండ్రిని మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్..!

- "ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బాలికను ఓ ఆకతాయి వేధిస్తున్నాడని షీ టీమ్‌కు సమాచారం అందించారు. ఆ పాఠశాల వద్దకు షీ టీమ్ పోలీసులు మఫ్టీలో వెళ్లి సదరు యువకుడిని పట్టుకున్నారు. యువకుడి కుటుంబ సభ్యులను పిలిపించి పోలీస్‌లు వారి పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి వదిలేశారు."
- "మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతికి ఇన్‌స్టా గ్రామ్ ద్వారా సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. కొంత కాలం తర్వాత సదరు యువతి ఇన్‌స్టా గ్రామ్‌లో పోచేసిన ఫొటోలను మార్ఫింగ్ చేసి న్యూడ్ ఫొటోలు ఆమెకు పంపించి బ్లాక్ మెయిల్ చేశాడు. దీంతో సదరు మహిళ ఇంట్లో తెలిస్తే ఇబ్బంది అవుతుందని షీటీమ్‌ను ఆశ్రయించింది. వెంటనే కేసు నమోదు చేసుకొని సదరు యువకుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి పూర్తిగా ఫొటోలు డిలేట్ చేయించారు. తర్వాత యువకుడిని రిమాండ్‌కు తరలించారు. ఇలా జిల్లాలో పలు కేసులను షీటీమ్ సామరస్యంగా పరిష్కరిస్తూ మహిళలకు తోడుగా నిలుస్తోంది."


అవగాహన కల్పిస్తున్న షీటీమ్ ఎస్సై హైమ

- భరోసా కల్పిస్తున్న షీటీమ్
- చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలి
- తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలి
- బాలికలకు స్వీయరక్షణపై షీటీమ్ శిక్షణ
- షీటీమ్‌తో బాలికలకు, మహిళలకు భరోసా

2023 జనవరి నుంచి జులై వరకు షీటీమ్ కార్యక్రమాలు

అవగాహన కార్యక్రమాలు 175
వచ్చిన పిటిషన్లు 034
కౌన్సెలింగ్ 026
నమోదైన కేసులు 08

మంచిర్యాలక్రైం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతూ నూతన ఆవిష్కరణలతో ఆకాశమే హద్దుగా విస్తరిస్తున్న నేపథ్యంలో మానవ సంబంధాలు క్షీణిస్తున్నాయి. అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నా అసమానాతలు, అనిచివేత తప్పడం లేదు. ముక్కుపచ్చలారని చిన్నారుల నుంచి ఆరుపదుల వయసు వృద్ధుల వరకు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఇటువంటి సమయంలో చిన్నారులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కుటుంబంపై ఎంతైనా ఉంది. అలాగే పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన షీ టీమ్ ద్వారా సైతం విస్తృతంగా అవగాహన కల్పిస్తూ తోడుగా నిలుస్తున్నారు.

అవగాహన పెంచాలి..

బాలికలపైలైంగిక వేధింపులు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో కుటుంబాల్లో బాలికలకు తమ జీవన శైలిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ప్రేమ తో కూడిన స్పర్శకు, చెడు స్పర్శకు తేడాను పసిగట్టే విధంగా బాలికల్లో అవగాహన పెంచాలని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

చైతన్యవంతం చేయాలి...



బాలికలకు చిన్నతనం నుంచే ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వం పెంచాలి. వయసును దృష్టిలో ఉంచుకొని స్పర్శ సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనలో మార్పులు, ఒత్తిళ్లను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా చైతన్యవంతం చేయాలి.

– విశ్వేశ్వర్‌రావ్, మానసిక వైద్యనిపుణుడు, మంచిర్యాల

ఫిర్యాదు చేసేందుకు భయపడొద్దు



సమాజంలో ఎదురయ్యే విపత్కర పరిస్థితుల్లో తక్షణమే ఫిర్యాదు చేసేందుకు బాలికలు ఏ మాత్రం భయపడకూడదు. ఇళ్లు, కాలేజీ, స్కూల్, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడైనా ఇబ్బంది కలిగితే పోలీసులను సంప్రదించాలి. న్యాయం జరిగే వరకూ పోరాటం చేసే తెగువ అమ్మాయిల్లో రావాలి. ఇంటి నుంచే బాలికలను ధైర్యంగా తీర్చిదిద్దేందుకు కుటుంబ సభ్యులు శ్రీకారం చుట్టాలి.

– సుధీర్ రాంనాథ్ కేకన్, డీసీపీ, మంచిర్యాల

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళల భద్రతకు షీటీమ్‌పై విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. వారి పేర్లు గోప్యంగా ఉంచబడుతాయి. యువతులు ఇన్‌స్టా గ్రామ్ ద్వారా అయిన పరిచయాలతో మోసపోతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్‌లో ఫొటోలు పెట్టుకోకపోవడం మంచిది. – హైమ, ఎస్సై, షీటీం మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి

తండాలకు తీజ్ శోభ

- యువతులు నిర్వహించే విశిష్ట పండుగగా ప్రతీక
- శ్రీకృష్ణాష్టమితో ముగింపు


తీజ్ బుట్టల్లో నీళ్లు చల్లుతున్న యువతులు

కెరమెరి(ఆసిఫాబాద్): తీజ్.. గిరిజన తండాల్లో తేజాన్ని నింపే పండుగ, గిరిజన యువతులు తమ ఆశలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా నిర్వహించుకుని ఉత్సవమిది. ఆటాపాటలు, విందులు, వినోదాలు, వినూత్న ఆచారాలతో బతుకమ్మ తరహాల్లో ఆధ్యాతం ఆసక్తికరంగా సాగే ఈ వేడుకలు గురువారం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లోని తండాల్లో ప్రారంభమైయ్యాయి. జిల్లాలోని బంజార (లంబాడా)తండాల్లో రక్షాబంధన్ నుంచి తీజ్ ఉత్సవం ప్రారంభమైంది. శ్రీకష్ణాష్టమికి ముగియనుంది.

తీజ్ పండుగలో నిమగ్నం..

జిల్లాలో గిరిజన లంబాడాలు తమతమ సంప్రదాయాలకు అనుగుణంగా ఎవరికి వారు పండుగలు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాఖీ పౌర్ణమి నుంచి లంబాడా గిరిజనులంతా 'తీజ్' పండుగ జరుపుకోవడంలో నిమగ్నమై ఉన్నారు. ఒక వైపు యువతులు ఆడిపాడుతు కుల దేవతలను కొలుస్తూ ఎరుపుమట్టిలో గోధుమలు చల్లిన బుట్టలనే తీజ్ బుట్టలంటారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని ' తీజ్ భరాయిరో' అని పిలుస్తారు. యువతులంతా నియమ నిష్ఠలను పాటిస్తున్నారు. గ్రామానికి మంచి జరగాలని, తమకు మంచి భర్త రావాలని కోరుకుంటూ ఉపవాస దీక్షలు ప్రారంభించారు.

ఏడో రోజు'ధమోలీ' సందడి!..

ఈ రోజు ప్రతీ ఇంట్లో బియ్యపు పిండితో రొట్టెలు చేస్తారు. ఆ రొట్టెలను బెల్లం నెయ్యితో కలుపుతారు. ఈ మిశ్రమాన్నే చూర్మో అంటారు. ఈ చూర్మోన్నే తీజ్ బుట్టలున్న ఇంటి ఆవరణలో నెలకొల్పిన కులదేవుడు 'సేవాభయ్య' శాఖాహారి కావున ఆయనకు నైవేద్యంగా సమర్పిస్తారు. జొన్న పిండితో ముగ్గులు వేసి వాటి మధ్యన వెండితో తయారు చేసిన 'మేరామ యాడి' తల్లి విగ్రహాన్ని ఉంచి దీపం వెలిగించి పూజ చేస్తారు. ఆ రాత్రే యువతులు ఇంటింటికి చూర్మోని సేకరిస్తారు. వరసైన వారికి పూస్తూ నృత్యాలు చేస్తారు.

ఎనిమిదో రోజు 'గణగోర్' వివాహం..

ఎనిమిదో రోజు యువతులంతా చెరువు వద్దకు వెళ్లి మట్టిని తీసుకొస్తారు. రెండు, ఆడ మగ బొమ్మలను తయారు చేస్తారు. ఆడ బొమ్మకు గాంగ్రి, మగ బొమ్మకు ధోవతి, లాల్చితో వేశాధారణ చేస్తారు. ఆ రెండు బొమ్మలను మేళతాళాలతో తీజ్‌లు ఉన్న చోటకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ ఆ బొమ్మలకు ఘనంగా వివాహం జరిపిస్తారు.

తొమ్మిదో రోజు..

తొమ్మిదో రోజును 'తీజ్ తోడేరో దాడో' అని పిలుస్తారు. మంచే పైనున్న తీజ్ బుట్టలను కిందికి దించి 'తీజ్' నారును తెంపుతారు. దాన్ని వరుసగా కూర్చొన్న మగవారి తలపాగలో పెడతారు. ఆడవారైతే కొంగుకు కట్టుకుంటారు. అనంతరం జొన్న రొట్టెలు, చేసి డప్పు వాయిద్యాలతో తీజ్ నిమజ్జనానికి బయలుదేరుతారు. దగ్గర్లోని చెరువులు లేదా బావుల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. ఈ రోజు ప్రక్రియను 'తీజ్ ఎరాయోరో' పిలుస్తారు.

పంటల్లో దిగుబడులు రావాలని



పంటల దిగుబడులు రావాలని, కుటుంబమంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ తీజ్ ఉత్సవాన్ని నిర్వహిస్తాం. యువతులు మంచి వరుడు రావాలని కోరుకుంటారు. ఈ పండగంటే చాలా ఇష్టం.

– జాదవ్ దివ్వరాని, ప్రైవేట్ టీచర్, చందుగూడ

చిన్నప్పటి నుంచి..



తీజ్ ఉత్సవం చిన్నప్పటి నుంచి నిర్వహిస్తున్నాం. ప్రతీ ఏటా రాఖీ పౌర్ణమి నుంచి శ్రీకృష్ణాష్టమి వరకు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తాం. తోటి వారిని ఏకం చేసే పండగ. ప్రతి రోజు ఉదయం సాయంకాలం ఒకే చోట చేరి పాటలు పాడుతాం. నృత్యాలు చేస్తాం.

– జాదవ్ రుషిక, ప్రైవేట్ టీచర్, చందుగూడ

మతంతో సంబంధం లేని రక్షాబంధన్


రహమాన్‌కు రాఖీ కడుతున్న అంజలి

నెన్నెల: మంచి మనసు ఉంటే చాలు అనుబంధానికి మతంతో సంబంధం లేదని నిరూపిస్తున్నారు మండల కేంద్రంలోని వడ్ల వాడకు చెందిన రేవెల్లి అంజలి అనే యువతి. ఇంటి పక్కనే ఉంటున్న సోదర సమానుడైన రహమాన్‌కు ఏటా రాఖీ కడుతూ మతసామరస్యాన్ని చాటుతూ అనుబంధాన్ని దేవుడిచ్చిన బంధం అని కొనసాగిస్తున్నారు. అంజలికి సోదరులు లేరు. రహమాన్‌కు సోదరీమనులు లేకపోవడంతో అక్కా, తమ్ముళ్లు లాగా కలిసి మెలిసి ఉంటున్నారు. గురువారం రాఖీ కట్టి మతంతో సంబంధం లేదని చాటిచెప్పింది.

హామీలను వంద రోజుల్లో నెరవేరుస్తాం

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ


సమావేశంలో మాట్లాడుతున్న కొక్కిరాల సురేఖ

మంచిర్యాలటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో గురువారం మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని తెలిపారు. రాజస్థాన్‌లో రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, కౌలు రైతులకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజిద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డే రాజమౌళి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాలిద్, పట్టణ ఉపాధ్యక్షుడు జోగుల సదానందం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ అధ్యక్షురాలు హేమలత, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట లావణ్య, మాజీ కౌన్సిలర్ గాండ్ల సత్తమ్మ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ వైద్యవిధాన పరిషత్, జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయం, మంచిర్యాల పరిధిలోని ఆసుపత్రుల్లో పనిచేసేందుకు ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిన పనిచేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయ పర్యవేక్షకులు డాక్టర్ అరవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పంద పద్ధతిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్స్ 10, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 1, పొరుగు సేవల పద్ధతిన సిటి స్కాన్ టెక్నీషియన్ 1, ఫార్మాసిస్ట్ గ్రేడ్2 ఒకటి, థియేటర్ అసిస్టెంట్ 1 పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. మార్చి 31, 2024 వరకు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అవసరం మేరకు నియామకం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి 8వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కార్యాలయ పనివేళల్లో జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయంలో దరఖాస్తుతోపాటు, సంబంధిత ధ్రువపత్రాల నకలు ప్రతులను సమర్పించాలని, వివరాలు www.mancherial.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని వెల్లడించారు.

కార్యకర్తలపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

లక్సెట్టిపేట: మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని శిల్వగుట్ట వద్ద అక్రమంగా బీఆర్ఎస్ నాయకులు మొరం తవ్వుతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లి అడ్డుకున్నారని తెలిపారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ కార్యకర్తలైన రాందేని చిన్న వెంకటేష్, శ్రీధర్‌లపై దాడి చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సంఘటనపై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశామని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో బీఆర్ఎస్ నాయకుల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, అక్రమంగా మొరం తవ్వకాలు చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండల కేంద్రంలో ఉండాల్సిన అధికారులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారని, దీంతో రాత్రి వేళలో మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి చేసినందుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు పింగిళి రమేష్, నాయకులు నాగభూషణం, చితం అశోక్, దుమ్మని లచ్చన్న, నవాబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి రాఖీ రద్దీ..!


బస్సు వద్ద ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: రాఖీ పండుగ నేపథ్యంలో గురువారం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. సోదరులకు రాఖీ కట్టేందుకు మహిళలు సొంత ఊళ్లకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం రద్దీగా ఉన్న రూట్లలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ మంచిర్యాల బస్‌స్టేషన్‌లో గురువారం బస్సులు వచ్చిరాగానే ప్రయాణికులు చుట్టుముట్టారు. కిటికిలోనుంచి సీట్ల కోసం పాట్లు పడాల్సి వచ్చింది.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో సిబ్బంది..

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. పాఠశాలకు చెందిన శాలిని, స్ఫూర్తి, స్నేహ, స్వాతి, లక్ష్మిప్రసన్నలు మహారాష్ట్రాలోని సాంగ్విలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

డిప్యూటీ వార్డెన్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: బెల్లంపల్లి తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల(బాలికలు)లో డి ప్యూటీ వార్డెన్ పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అ ధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. డిగ్రీ, బీఈడీ అ ర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు బెల్లంపల్లి కళాశాలలో లేదా జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం మంచిర్యాలలో దరఖాస్తులు అందించాలని వివరించారు.

మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు 4న ఇంటర్వ్యూ

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నస్పూర్, శంషేర్‌నగర్, మంచిర్యాలలోని హమాలీవాడ, సాయికుంట బస్తీ దవాఖాన, ఐటీడీఏ పరిధిలోని కాసిపేట్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల కోసం ఈనెల 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు.

ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి


శివరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, జీఎం సంజీవరెడ్డి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు
- సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

నస్పూర్: సింగరేణి సంస్థ అభివృద్ధిలో సంస్థ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసి పదవీ విరమణ పొందుతున్న సివిల్ డీజీఎం శివరావును గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్యే, ఏరియా జీఎం సంజీవరెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో శివరావు కృషి అభినందనీయమని తెలిపారు. జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో సివిల్ విభాగానికి ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారని తెలిపారు. సీహెచ్‌పీ నిర్మాణం, జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం, కమ్యూనిటీ హాల్స్ ఆధునీకరించడం వంటి అభివృద్ధి పనులను శివరావు ప్రత్యేకంగా చేపట్టారని కొనియాడారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కె. సురేందర్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం రఘుకుమార్, అధికారుల సంఘం నాయకులు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, అధికారులు శ్రీధర్‌రావు ఉన్నారు.

ఆర్కే 5 గనిపై...

ఆర్కే 5 గనిపై రిటైర్డ్ అవుతున్న షేక్‌షఫి(వెండర్), రామిల్ల రోశయ్య (ఎస్‌డిఎల్ ఆపరేటర్)లను గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్ శాలువ కప్పి సన్మానించారు. రక్షణ అధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్, ఫిట్‌సెక్రటరీ సత్యనారాయణ ఉన్నారు.

ఎస్ఆర్‌పీ 3,3ఏ గనిపై...

ఎస్ఆర్‌పీ 3, 3ఏ గనిపై గడికొప్పుల శంకరయ్య (సపోర్ట్‌మెన్)ను డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్ ఫిట్ సెక్రటరీ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ఈ మహేందర్, డీవై మేనేజర్ చంద్రముర్ము, ఫిట్ ఇంజనీర్ ప్రేంకుమార్, అధికారులు అరుణ్‌కుమార్, రామకృష్ణ, సాయిశ్రావణ్ పాల్గొన్నారు.


శ్రీరాంపూర్ ఓసీపీపై...

శ్రీరాంపూర్ ఓసీపీపై కొండం మల్లారెడ్డి (సీనియర్ అండర్ మేనేజర్)కు ప్రాజెక్టు ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సుధీర్‌జక్కుల వార్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఫిట్ సెక్రటరీ కందుల శంకరయ్య, రక్షణాధికారి సంపత్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

ఆర్కే–7 గనిపై..

ఆర్కే–7 గని పై నాగుడి రవీందర్‌రెడ్డి (ట్రామర్), మల్క శంకరి (హాలర్ ఆపరేటర్), సివ్వురి రాజేశ్ (హాలర్ ఆపరేటర్)లకు గని మేనేజర్ సాయిప్రసాద్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రక్షణ అధికారి రవిశంకర్, ఫిట్ సెక్రటరీ మెండె వెంకటి, ఫిట్ ఇంజినీర్ వెంకట్‌రామ్, రాజు, వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్‌రావు, సంక్షేమ అధికారి సంతన్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అందజేత


మొబైల్ ఫోన్ అందిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నస్పూర్‌కు చెందిన బొద్దుల మహేందర్ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీసులు కనిపెట్టి గురువారం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా బాధితుడికి అందించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఆధార్‌కార్డు, ఫోన్ ఐఎంఈఐ నంబర్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెబ్‌సైట్‌లోకి లాగినై అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. పోర్టల్ ద్వారా మొబైల్ బ్లాక్ చేసి సిమ్‌కార్డులు మార్చిన వెంటనే ట్రేస్ చేసి సమాచారం అందించడంతో వారి వివరాలను తెలుసుకుని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లు చోరీకి గురైతే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కోర్టు భవన నిర్మాణ పనులు పరిశీలించిన జడ్జి


పనుల పరిశీలనలో న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

బెల్లంపల్లి: బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణ పనులను గురువారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు పరిశీలించారు. మంచిర్యాల సబ్ జడ్జి ఉదయ్‌కుమార్, బెల్లంపల్లి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ముఖేష్‌తో కలిసి భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఇప్పటికే భవన నిర్మాణ పనులు కాస్తా ఆలస్యం కాగా ఇక ఏమాత్రం జాప్యం చేయకుండా సత్వరమే పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మాణం చేస్తున్న కోర్టు భవనంలోని విభాగాలకు, ప్రత్యేకించి పోలీసులకు ఓ గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా న్యాయమూర్తి వెంట బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, కార్యదర్శి సింగతి రాజేష్, న్యాయవాదులు గోపికిషన్‌సింగ్, ఎల్.రాము, అశోక్ ఉన్నారు.